

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 23 బుధవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 230 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

WEDNESDAY SEPTEMBER 23 2026 | VOL:18 | ISSUE: 230 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

జూరాలకు నీళ్లివ్వండి..

కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్

నీటి విడుదలకు శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం

బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ

విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి

జూరాల నీటి కోసం రైతుల ఆందోళన





ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు.అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు. జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన.. మహిళా క్రికెట్ జట్టుకు ప్రధాని అభినందనలు..!

'ఆసియా క్రీడలు-2026 ' లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంక ను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయమని అన్నారు. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడారు. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘమని, ఈ విజయంతో దేశం గర్విస్తోందని అన్నారు. స్వర్ణం గెలిచిన జట్టు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ.. షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు.



నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ నివాసాలపై ఏసీబీ దాడులు

లక్ష్మీ భాస్కర్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు

ఆయన నివాసంతో పాటు బంధువులు, సన్నిహితుల నివాసాల్లో ఏసీబీ సోదాలు

భారీ ఎత్తున నగదు, ఆభరణాలు, ఆస్తుల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) డిప్యూటీ (మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం

వాయుగుండం ప్రభావంతో తెలంగాణకు రెండు రోజుల వర్ష సూచన

ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 20 జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక

అధికారులను అప్రమత్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో (మిగతా 2వ పేజీలో..)

చిన్న పిల్లల మరణాలకు సీఎం రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి : కేటీఆర్

అదిలాబాద్ జిల్లా రిమ్స్ హాస్పిటల్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ దుర్ఘటనలో ఇంకా 23 మంది పసిపిల్లలు గాయపడిన నేపథ్యంలో వెంటనే మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగి, అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేసిన సీఎం రేవంత్ రెడ్డే ఈ సంఘటనకు (మిగతా 2వ పేజీలో..)



కామరాజర్ పేరుతో అల్పాహార పథకం.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సీఎం విజయ్

తమిళనాడులో 8వ తరగతి వరకు విస్తరించిన ఉచిత అల్పాహార పథకం

'పెరుంతలైవర్ కామరాజర్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్'గా పేరు మార్పు

అదనంగా 15.3 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం

పథకం మొత్తం బడ్జెట్‌ను సుమారు రూ. 724 కోట్లకు పెంచిన ప్రభుత్వం

చెన్నైలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన సీఎం విజయ్



తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ఈ పథకాన్ని మంగళవారం నుంచి 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కూడా వర్తింపజేశారు. ఈ సందర్భంగా పథకం పేరును 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' నుంచి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, విద్యా సంస్కరణల ప్రదాత అయిన 'పెరుంతలైవర్ కామరాజర్ అల్పాహార పథకం'గా మారుస్తున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని తిరువాన్మియూర్‌లో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో సీఎం విజయ్ ఈ విస్తరణ కార్యక్రమాన్ని లాంఛనంగా (మిగతా 2వ పేజీలో..)



విజయకేరళం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

కొత్త పార్టీలకు అసలు పరీక్ష క్షేత్రస్థాయిలోనే!

రాజకీయాల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేయడం ఒక అడుగు మాత్రమే. దానిని ప్రజల్లోకి తీసుకెళ్లడం, గ్రామస్థాయి నుంచి బలమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకోవడం, నాయకత్వంపై విశ్వాసాన్ని పెంచుకోవడం అసలు సవాలు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త రాజకీయ వేదికలు తెరపైకి వస్తున్న నేపథ్యంలో వాటి భవిష్యత్తుపై సహజంగానే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కొత్త పార్టీలు తమకు రాజకీయంగా పరిచయమున్న ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని సంస్థాగత బలం పెంచుకునే ప్రయత్నం చేయడం రాజకీయాల్లో సాధారణ వ్యూహమే.కొత్త రాజకీయ పార్టీకి భారీ సభలు, జనసమీకరణలు ప్రారంభంలో ఉత్సాహాన్ని ఇవ్వగలవు. అయితే సభకు వచ్చిన జనాన్ని పార్టీ కార్యకర్తలుగా మార్చడం, గ్రామాలు--మండలాలు--నియోజకవర్గాల స్థాయిలో కమిటీలను నిర్మించడం, స్థానిక సమస్యలపై నిరంతరం పనిచేయడం మరింత కీలకం. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే రాజకీయ శక్తికంటే ప్రజల మధ్య నిరంతరం ఉండే సంస్థాగత వ్యవస్థకే దీర్ఘకాలంలో ప్రాధాన్యం ఉంటుంది.

మహిళా నాయకత్వానికి పెరుగుతున్న ప్రాధాన్యం

మహిళలను రాజకీయాల్లో ముందుకు తీసుకురావాలనే చర్చ చాలాకాలంగా కొనసాగుతోంది. మహిళా రిజర్వేషన్ అంశం నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు మహిళా నాయకత్వాన్ని పెంపొందించడంపై మరింత దృష్టి సారించే పరిస్థితి ఏర్పడుతోంది. అయితే మహిళలకు అవకాశాలు కల్పించడం కేవలం ఎన్నికల వ్యూహంగా పరిమితం కాకూడదు. గ్రామస్థాయి నుంచి వారికి రాజకీయ శిక్షణ, నిర్ణయాధికారం, సంస్థాగత బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.అదే సమయంలో యువతరాన్ని రాజకీయాల్లోకి తీసుకురావడం కూడా పార్టీల ముందున్న కీలక అంశం. సోషల్ మీడియా ప్రభావం, మారుతున్న రాజకీయ అవగాహన, ఉపాధి--విద్య--స్థానిక అభివృద్ధి వంటి అంశాలపై యువత చూపుతున్న ఆసక్తిని పార్టీలు విస్మరించలేవు. యువతను కేవలం ప్రచారానికి ఉపయోగించకుండా నాయకత్వ బాధ్యతల్లో భాగస్వాములను చేయగలిగితేనే కొత్త తరం రాజకీయ నాయకత్వం తయారవుతుంది.

చేరికలే బలానికి కొలమానం కాదు

ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి నేతల చేరికలు జరిగినప్పుడల్లా రాజకీయ సమీకరణాలు మారుతున్నాయనే ప్రచారం జరుగుతుంది. కానీ చేరికల సంఖ్య మాత్రమే ఒక పార్టీ బలాన్ని నిర్ణయించదు. ప్రజల్లో ఆ పార్టీకి ఎంత ఆదరణ ఉంది? స్థానిక సమస్యలపై ఎలాంటి వైఖరి తీసుకుంటోంది? గ్రామస్థాయిలో కార్యకర్తల వ్యవస్థ ఉందా? ఎన్నికలు వచ్చినప్పుడు ఓటర్లను ప్రభావితం చేసే స్థాయిలో సంస్థాగత నిర్మాణం ఏర్పడిందా? అనే అంశాలే కీలకం. అధికార పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ అయినా కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన పెరిగితే అసంతృప్తి సహజం. అలాంటి సమయంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికలు ఆ అసంతృప్తిని తమవైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తాయి. అయితే కార్యకర్తల అసంతృప్తిని రాజకీయ బలంగా మార్చుకోవడం అంత సులభం కాదు. స్థానిక నాయకత్వం, సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల ప్రభావం, ప్రజా సమస్యలు వంటి అనేక అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.

ప్రజా సమస్యలే రాజకీయాలకు కేంద్రం కావాలి

కొత్త పార్టీలు పాత పార్టీలను విమర్శించడం ద్వారా మాత్రమే తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించలేవు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన విధానాలను ప్రజల ముందుంచాలి. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యామ్నాయ కార్యాచరణను వివరించాలి.అధికార పార్టీలు కూడా కొత్త రాజకీయ శక్తుల కదలికలను కేవలం ఎన్నికల కోణంలోనే చూడకుండా ప్రజల్లో అసంతృప్తికి కారణాలేమిటో పరిశీలించాలి. కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడం వంటి అంశాలే రాజకీయంగా సమర్థమైన ప్రతిస్పందనకు పునాది.

చివరి తీర్పు ప్రజలదే

సభలకు వచ్చే జనసందోహం, నాయకుల చేరికలు, సోషల్ మీడియా ప్రచారం రాజకీయ వాతావరణాన్ని సూచించవచ్చు. కానీ అవే ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయని చెప్పలేం. రాజకీయ పార్టీకి అసలైన పరీక్ష ప్రజల విశ్వాసాన్ని ఎంతవరకు సంపాదించగలిగిందన్నదే. కొత్త రాజకీయ శక్తులకు అవకాశం ఎంత ఉందో, పాత పార్టీలపై అసంతృప్తి ఎంత ఉందో ఎన్నికల సమయంలో ఓటర్ల నిర్ణయమే స్పష్టం చేస్తుంది. అప్పటివరకు రాజకీయ పార్టీల మధ్య పోటీ వ్యక్తుల చుట్టూ కాకుండా ప్రజా సమస్యలు, విధానాలు, అభివృద్ధి ప్రణాళికల చుట్టూ సాగితేనే ప్రజాస్వామ్యానికి మేలు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

చిన్న పిల్లల మరణాలకు సీఎం రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

పూర్తి బాధ్యత వహించాలన్నారు. రిమ్స్ హాస్పిటల్‌లో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు బీఆర్ఎస్ జిల్లా నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించినా మొద్దునిద్ర పోయిన రేవంత్ సర్కారులో కనీస చలనం కనిపించలేదు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించడం, కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ దవాఖానల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయించి ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రేవంత్ సర్కారు చేతకానితనం వల్ల తమ పసిపిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కామరాజర్ పేరుతో అల్పాహార పథకం.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సీఎం విజయ్

మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి కూర్చొని భోజనం చేశారు. ఈ విస్తరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15,454 ప్రభుత్వ, ప్రభుత్వ-ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 15.3 లక్షల మంది విద్యార్థులు అదనంగా లబ్ధి పొందనున్నారు. ఈ పథకం కింద మొత్తం ప్రయోజనం పొందేవారి సంఖ్య 34.64 లక్షలకు చేరనుంది.పథకం విస్తరణ కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అదనంగా రూ. 217.63 కోట్లను కేటాయించింది. దీంతో ఈ పథకం మొత్తం వార్షిక బడ్జెట్ సుమారు రూ. 724 కోట్లకు పెరిగింది. వాస్తవానికి ఈ అల్పాహార పథకాన్ని 2022లో గత డీఎంకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎం.కె. స్టాలిన్ ప్రాథమిక తరగతుల కోసం ప్రారంభించారు. ఇప్పుడు విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించడమే కాకుండా, దాని పరిధిని పెంచి దివంగత నేత కామరాజర్ పేరు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు ప్రారంభమైనప్పటికీ, కొన్ని జిల్లాల్లో ఉపఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అక్కడ తాత్కాలికంగా వాయిదా వేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఆద్యుడిగా పేరుగాంచిన కామరాజర్ పేరును ఈ పథకానికి పెట్టడం ద్వారా ఆయన వారసత్వాన్ని గౌరవించినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ నివాసాలపై ఏసీబీ దాడులు

మొదటి పేజీ తరువాయి)

సూపరింటెండెంట్‌గా సేవలు అందిస్తున్న డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసాలు, కార్యాలయాలపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు చేపట్టారు. భారీ స్థాయిలో ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారం, ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు ప్రారంభించాయి. ఎర్రగడ్డలోని 'కల్పతరువు అపార్ట్‌మెంట్స్'లోని ఆయన నివాసంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులకు చెందిన దాదాపు 13 ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిమ్స్ ఆసుపత్రిలో సుమారు 20 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీభాస్కర్, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్ వంటి అత్యంత కీలకమైన బాధ్యతల్లో కొనసాగుతున్నారు. వైద్య పరికరాల కొనుగోళ్లు, పరిపాలనాపరమైన నిర్ణయాల్లో గతంలోనూ ఆయనపై పలు అవినీతి ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ సోదాల్లో భారీ ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు, విలాసవంతమైన భవనాలు, స్థలాలు మరియు పలు వ్యాపారాల్లో పెట్టుబడులకు సంబంధించిన కీలకమైన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నట్లు సమాచారం.

కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు.. దసరాకు ముందే పంపిణీ!

హైదరాబాద్, సెప్టెంబర్ 22:

తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం.. తెలుగు చిత్రాలకు 9 అవార్డులు

ఇంటర్నెట్ డెస్క్: ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుజరాత్‌లో అవార్డు ప్రదానోత్సవం జరగడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పలువురు సినీకళాకారులు పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, బాలీవుడు నటుడు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. చందూ ఛాపియన్ చిత్రానికి కార్తిక్ ఆర్యన్‌ను, భ్రమయుగం చిత్రానికి మమ్ముట్టిని ఈ అవార్డు వరించింది. కల్కి 2898 ఏడీ ప్రజాదరణ పొందిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 నిలిచింది. ఆ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. అమరన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి అవార్డును అందుకున్నారు. ఈసారి తెలుగు సినిమాలు కూడా సత్తా చాటాయి. 'కల్కి 2898'తో పాటు 'కమిటీ కుర్రోళ్లు', '35.. చిన్న కథ కాదు', 'పుష్ప-2', 'లక్కీ భాస్కర్' సహా పలు చిత్రాలు వివిధ విభాగాల్లో మొత్తం 9 అవార్డులను సొంతం చేసుకున్నాయి. చలనచిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం సాధారణంగా ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. 1954 నుంచి ఈ వేదికగానే అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో ఓసారి మాత్రమే చెన్నైలో జరిగింది. ఇక కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు.



విజయకేరటం
తెలుగు దినపత్రిక

కాంగ్రెస్ ఓబీసీ పదవులకు దరఖాస్తుల స్వీకరణ





జిల్లా, మండల, డివిజన్ స్థాయిల్లో ఆశావహుల నుంచి దరఖాస్తులు

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 22:

కాంగ్రెస్ పార్టీని గ్రామ,బూత్ స్థాయి నుండి బలోపేతం చేయడంలో ఓబీసీ నాయకులు, కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమైనది ఓబీసీ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్‌చార్జి జిల్లాపల్లి పరమేష్ అన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని వెంకట్రామ జంక్షన్ నందు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం జిల్లా, మండల, డివిజన్ స్థాయి పదవులకు ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఓబీసీ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్‌చార్జి జిల్లాపల్లి పరమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సమక్షంలో పలువురు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాపల్లి పరమేష్ మాట్లాడుతూ ఓబీసీ విభాగాన్ని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా, మండల, డివిజన్ స్థాయిల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని అన్నారు. ఓబీసీ వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.వివిధ స్థాయి పదవులకు ఆశావహులు దరఖాస్తులు సమర్పించడంతో పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆయా స్థాయిల్లో పదవుల భర్తీ ప్రక్రియ కొనసాగనుంది.కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు బొమ్మగాని విక్రమ్ గౌడ్, పగిళ్ల రాజు, తోట మురళి, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, గోరంటాల రాజుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఓబీసీ పదవుల ఆశావహులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో వరుస ఘటనలు.. బాధ్యత ఎవరిది?





పెచ్చులు ఊడిపడుతున్నా చర్యలేవి?

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 22:

ఉత్తర తెలంగాణకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడిపడి రోగులు గాయపడిన ఘటన మరువకముందే మంగళవారం ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లో పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వరుస ఘటనలతో ఆస్పత్రిలోని పాత భవనాల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆస్పత్రి పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన మాజీ పశ్చిమ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ఎంజీఎం మార్చురీ సమీపంలో ఉద్రిక్తత నెలకొంది. వినయ్ భాస్కర్, ఆయన వెంట వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలకు పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో వినయ్ భాస్కర్ సొమ్మసిల్లి కిందపడినట్లు ఆయన అనుచరులు తెలిపారు. పోలీసులు తనపై చేయి చేసుకున్నారని ఆయన ఆరోపించడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆరోగ్యశ్రీ వార్డు ఘటన అనంతరం జిల్లా కలెక్టర్, వైద్య విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎంజీఎంను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అయితే మరుసటి రోజే ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లో మరోసారి పెచ్చులు ఊడిపడటం ఆస్పత్రి నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.ప్రమాదాలు పునరావృతం కాకుండా పాత భవనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, ప్రమాదకర ప్రాంతాల్లో తక్షణ మరమ్మతులు చేపట్టి రోగుల భద్రతకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పర్యాటక ప్రదేశాల సందర్శనతో చారిత్రక సాంస్కృతిక విజ్ఞానం పెంపొందుతుంది జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్





నల్లగొండ సెప్టెంబర్ 22 విజయ కెరటం ప్రతినిధి

తెలంగాణలోని ముఖ్యంగా నల్లగొండ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల విద్యార్థులకు చారిత్రక, సాంస్కృతిక విజ్ఞానం కలుగుతుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జిల్లా స్థాయి 'యువ టూరిజం క్లబ్' పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లా పర్యాటక శాఖ మరియు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో, తెలంగాణ టూరిజం సహకారంతో 'యువ టూరిజం క్లబ్' ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించబడుతున్నాయని అన్నారు. వారసత్వం మరియు సమాజ ప్రోత్సాహం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. ఈ జిల్లా స్థాయి కళాశాల పోటీలలో భాగంగా షార్ట్ ఫిలిం/రీల్ పోటీలు, సోషల్ మీడియా టూరిజం క్యాంపెయిన్, టూరిజం అవేర్‌నెస్ స్కిల్స్, పాటలు, నృత్యం, మరియు డ్రామా వంటి వివిధ అంశాలు నిర్వహించడ్డాయి. అలాగే తక్కువ ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రదేశాలు, మరుగన పడిన కళలు, మరియు స్థానిక భాగస్వామ్యంతో కూడిన వినూత్న ఆలోచనలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్, అడిషనల్ ఎస్పీ జి రమేష్, నల్గొండ డిస్టిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దసరా నాయక్, జిల్లా పంచాయతి అధికారి తరుణ్ చక్రవర్తి, నల్లగొండ జిల్లాడిప్యూటీ మేయర్ అఫ్రోఫ్ అలీ, కార్పొరేటర్ సమద్ ఎం. డి ఇంతియాజ్ జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండి అక్బర్ అలీ న్యాయ నిర్ణేతలుగా తెలుగుశాఖ అధ్యక్షులు డా. వెల్దశీడి శ్రీధర్, డా. ఎం.డి హసేనా జిల్లాలోని వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఈ నెల 23న జిల్లాలోని విద్యాసంస్థలకు స్థానిక సెలవు -జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్



నల్లగొండ సెప్టెంబర్ 22 విజయకేరటం ప్రతినిధి

గణేష్ నిమజ్జనం సందర్భంగా ఈ నెల 23 (బుధవారం) నాడు నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రైవేట్ విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.రహదారులపై రద్దీ, ట్రాఫిక్ సమస్యలు మరియు భారీగా విగ్రహాల నిమజ్జనం జరగనున్న దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ స్థానిక సెలవుకు (23.09.2026) బదులుగా రాబోయే సాధారణ సెలవు దినమైన 10.10.2026 (రెండవ శనివారం) నాడు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు సాధారణ పనిదినంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ ఉత్తర్వులను జిల్లాలోని విద్యాశాఖ అధికారులు మరియు విద్యాసంస్థల యాజమాన్యాలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

యువ ఆపద మిత్ర ఫస్ట్ బ్యాచ్ శిక్షణ ముగింపు





నల్లగొండ సెప్టెంబర్ 22 విజయకేరటం ప్రతినిధి

12వ బెటాలియన్ TGSP, అన్నేపర్తిలో కమాండెంట్ శ్రీ కె.బి. రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఆపద మిత్ర (YAMS) ఫస్ట్ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ బి. చంద్రశేఖర్, ఐ.ఏ.ఎస్. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిక్షణలో బాయ్స్ 30, గర్ల్స్ 68 మొత్తం 98 మంది యువ ఆపద మిత్రలు పాల్గొన్నారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం అందించడం, అత్యవసర రక్షణ చర్యలు చేపట్టడంపై SDRF సిబ్బంది శిక్షణ ఇచ్చారు. యువతకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు అవసరమైన రక్షణ పరికరాలు, కిట్లను సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తుల సమయంలో యువ ఆపద మిత్రలు పోలీస్, SDRF బృందాలకు సహాయకులుగా పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఎం. గౌతమ్ రెడ్డి,అడిషనల్ కమాండెంట్ యల్ నాగేశ్వర రావు అసిస్టెంట్ కమాండెంట్ నర్సింగ్ వెంకన్న,ఆర్ఐ రవీందర్,ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, గాణ=ళీ అధికారులు, సిబ్బంది, యువ ఆపద మిత్రలు పాల్గొన్నారు.

నల్గొండలో డ్రైనేజీ సమస్యలకు చెక్

- **మూడు డ్రైన్ క్లీనింగ్ మిషన్ వాహనాలు ప్రారంభం**



నల్గొండ, సెప్టెంబర్ 22: విజయ కెరటం ప్రతినిధి

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి మరో ముందడుగు పడింది. మున్సిపల్ కార్పొరేషన్ నూతనంగా కొనుగోలు చేసిన మూడు డ్రైన్ క్లీనింగ్ మిషన్ వాహనాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ప్రారంభించారు.నల్గొండలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి, మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్తో కలిసి వాహనాలను ప్రారంభించారు.నగరంలో డ్రైనేజీల్లో పేరుకుపోయే మురుగు, వ్యర్థాలను తొలగించడంతో పాటు వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ మిషన్ వాహనాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఆధునిక యంత్రాల సహాయంతో డ్రైన్లను శుభ్రం చేయడం ద్వారా పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడనుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోఫ్ అలీ అమేర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

108 ప్రసాదాలతో గణపతి పూజ.



హనుమకొండ సెప్టెంబర్ 22 విజయ కెరటం ప్రతినిధి

భీమారం 55వ డివిజన్ భద్రకాళి కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు 108 రకాల ప్రసాదాలతో మహా నైవేద్యం సమర్పించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీలోని సుమారు 150 కుటుంబాలకు చెందిన మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విగ్రహ దాత శ్రీనివాసరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తిప్పర్తి ఎస్ఐ ఇరుగు రవి, మాజీ సర్పంచ్ పుల్లాభట్ల ప్రవీణ్ కుమార్ ..





తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎస్సీ కాలనీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్లాభట్ల ప్రవీణ్ కుమార్ తో కలిసి తిప్పర్తి ఎస్ఐ ఇరుగు రవి పాల్గొన్నారు. సిరసవాడ సాయన్న, సైదమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి చిన్న కుమారుడు శంకర్ మనవళ్లు ఉడుముల శివ, విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఎస్ఐ ఇరుగు రవితో పాటు మాజీ సర్పంచ్ పుల్లభట్ల ప్రవీణ్ హాజరై భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఇరుగు రవి మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగలు ప్రజలందరినీ ఐక్యంగా కలిపే వేదికలని, కులమతాలకు అతీతంగా పరస్పరం సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలని అన్నారు. అన్నదానం మహోదానమని, ఆహారం అవసరమైన వారికి అందించడం ద్వారా సమాజంలో సేవాభావం, మానవత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. పండుగల సందర్భంగా యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా,పోలీస్ వారి సూచనలు నిబంధనలు పాటించాలని ఎస్ఐ రవి కోరారు. కార్యక్రమం నిర్వాహకులను అభినందించి, భక్తులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్ బొల్లం సంధ్యా ుసైదులు,మాజీ సర్పంచ్ మర్రి వెంకయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మర్రి నర్సయ్య ,మాజీ కో అప్షన్ మెంబెర్ గంట శంకర్,మర్రి కోటయ్య,పాక సైదులు,కుంచం సైదులు, బొల్లం సురేష్,దారమళ్ళ సైదులు,వల్లపు సతీష్,గంట కోటేష్,రోహిత్, నానీ, ఈశ్వర్ గ్రామస్థులు, ఉత్సవ నిర్వాహకులు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నాని కెరీర్‌లోనే రికార్డ్ బిజినెస్.. 'ది ప్యారడైజ్' బ్రేక్ ఈవెన్ టార్గెట్ తెలిస్తే షాక్ అవ్వాల్సిందే!

నేచురల్ స్టార్ నాని, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'దసరా' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో ఈ కొత్త చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ అంచనాలకు తగ్గట్టే 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే సరికొత్త చరిత్ర సృష్టించింది. నాని కెరీర్‌లోనే అత్యధికంగా ప్రపంచవ్యాప్తంగా రూ. 103 కోట్ల మేర థియేట్రికల్ ప్రీ రిలీజ్ బిజినెస్ జరుపుకొని సంచలనం రేపింది. ఈ చిత్రం బుధవారం రాత్రి నుంచే ప్రీమియర్ షోలతో ప్రేక్షకుల ముందుకు రానుంది.'దసరా' సినిమా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరడంతో 'ది ప్యారడైజ్' చిత్రంపై ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన బజ్ ఏర్పడింది. ఫలితంగా, నాని కెరీర్‌లో తొలిసారిగా ఒక చిత్రం ప్రీ రిలీజ్ థియేట్రికల్ బిజినెస్‌లోనే వంద కోట్ల మార్కును దాటింది. ఏరియాల వారీగా బిజినెస్ వివరాలు చూస్తే.. రెండు తెలుగు రాష్ట్రాలైన నైజాం, సీడెడ్, ఆంధ్రా ప్రాంతాల్లోనే హక్కులు సుమారు రూ. 75 కోట్లకు అమ్ముడయ్యాయి. ఇక కర్ణాటక, మిగిలిన భారతదేశం, ఓవర్సీస్ హక్కులు కలిపి మరో రూ. 28 కోట్లు పలికాయి. దీంతో మొత్తం థియేట్రికల్ బిజినెస్ రూ. 103 కోట్లకు చేరింది.ఈ భారీ వ్యాపారం నేపథ్యంలో సినిమా లాభాల్లోకి రావాలంటే భారీ వసూళ్లనే సాధించాల్సి ఉంటుంది. బయ్యర్లు పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలంటే (బ్రేక్ ఈవెన్) సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 104 నుంచి రూ. 105 కోట్ల షేర్ వసూలు చేయాలి. గ్రాస్ రూపంలో చెప్పాలంటే ఇది సుమారు రూ. 200 కోట్లకు సమానం. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే బ్రేక్ ఈవెన్ కావాలంటే దాదాపు రూ. 150 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టాల్సి ఉంటుంది. ఇది నాని ప్రస్తుత మార్కెట్ స్థాయికి ఇది అతిపెద్ద టార్గెట్ అయినప్పటికీ, సినిమాపై ఉన్న అంచనాలు, అడ్వాన్స్ బుకింగ్స్ జోరు చూస్తుంటే తొలివారంలోనే లక్ష్యాన్ని చేరుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు -- విగ్రహాల ఎత్తును బట్టి ప్రత్యేక నిమజ్జన మార్గాలు

- **ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు -- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ..**

నల్లగొండ సెప్టెంబర్ 22 విజయ కెరటంప్రతినిధి

నల్లగొండ జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు మరియు ఇతర భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు.గణేష్ విగ్రహాల ఎత్తును బట్టి ప్రత్యేక నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు ముందుగానే తమ విగ్రహాల ఎత్తును పరిశీలించుకుని, నిర్దేశించిన నిమజ్జన ప్రదేశాలకు అనుగుణంగా రూట్ ప్లాన్ చేసుకోవాలని సూచించారు. సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఖీూదీ) ఉన్నందున, 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న గణేష్ విగ్రహాలను ఈ సంవత్సరం 14వ మైలు, హాలియా వైపు అనుమతించబడదు .

విగ్రహాల ఎత్తును బట్టి నిమజ్జన మార్గాలు :

10 అడుగుల ఎత్తు వరకు ఉన్న విగ్రహాలు :

బతుకమ్మ కుంట / వల్లభరావు చెరువులో నిమజ్జనం చేసుకోవాలి.


10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలు:

క్లాక్ టవర్ -- రామగిరి -- పానగల్ ఫ్లైఓవర్ -- తిప్పర్తి -- వేములపల్లి మార్గం ద్వారా వేములపల్లి కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశంలో నిమజ్జనం చేసుకోవాలి.నిమజ్జన సమయంలో భక్తులు, నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలకు అనుగుణంగా ఊరేగింపులు నిర్వహించాలన్నారు. అలాగే డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, మద్యం సేవించి గణేష్ ఊరేగింపుల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్ని ధృవపత్రాలను



కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంకెన్ డ్రైవింగ్) చేయరాదని సూచించారు.ఈ సంవత్సరం "జీరో యాక్సిడెంట్ -- జీరో ఇన్సిడెంట్" లక్ష్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ కోరారు.





రష్మిక అంకితభావం అద్భుతం.. ఆమెతో పనిచేయడం మరిచిపోలేని అనుభూతి: 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లే

పుట్టినరోజున రష్మికపై ప్రశంసలు కురిపించిన దర్శకుడు రవీంద్ర పుల్లే

ఆయన దర్శకత్వంలో 'మైసా' చిత్రంలో నటిస్తున్న రష్మిక మందన్న

రష్మికతో పనిచేయడం స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

'మైసా' సినిమా కోసం రష్మిక ఎంతో అంకితభావంతో పనిచేశారని కితాబు

రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తాను దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా' గురించి, ఆమెతో తనకున్న అనుబంధం గురించి దర్శకుడు రవీంద్ర పుల్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, రష్మికతో కలిసి పనిచేయడం ఒక స్ఫూర్తిదాయకమైన, మర్చిపోలేని అనుభూతి అని ఆయన అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఒక సుదీర్ఘమైన, ఎమోషనల్ పోస్ట్ చేశారు."కొన్ని పుట్టినరోజులు కేవలం శుభాకాంక్షల వల్ల ప్రత్యేకంగా నిలుస్తాయి. కానీ ఈ పుట్టినరోజు మాత్రం ఆ విషెస్ చెప్పిన వారి వల్ల మరింత ప్రత్యేకంగా మారింది. నాకు కాల్స్, మెసేజ్‌లు, పోస్టుల ద్వారా విషెస్ చెప్పిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీరు చూపించిన ప్రేమ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది" అంటూ రవీంద్ర తన పోస్టులో పేర్కొన్నారు.అనంతరం 'మైసా' చిత్రం గురించి ప్రస్తావిస్తూ.. "మా ప్రయాణంపై నమ్మకం ఉంచి, 'మైసా' చిత్రాన్ని ఇంతగా ఆదరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రోత్సాహం మాటల్లో చెప్పలేనిది. ఈ కల నిజం కావడానికి అండగా నిలిచిన నా టీమ్, కుటుంబం, స్నేహితులు, ముఖ్యంగా రష్మిక మందన్న గారికి నేను ఎంతో రుణపడి ఉంటాను" అని ఆయన వివరించారు.రష్మిక గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "ఈ సినిమాను నమ్మి, ఎంతో విశ్వాసంతో నిలబడిన రష్మిక గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. 'మైసా' కోసం ఆమె ఎంతో నిజాయితీ, అంకితభావం, హృదయంతో పనిచేశారు. ఆమెతో కలిసి పనిచేయడం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఈ ప్రయాణంలో ఆమె ఒక ముఖ్యమైన భాగం కావడం సంతోషంగా ఉంది" అని రవీంద్ర పుల్లే తెలిపారు."మీ అందరి ప్రేమ నన్ను మరింత బాధ్యతాయుతంగా ఉండేలా చేస్తుంది. మెరుగైన పని చేయడానికి నన్ను ప్రోత్సహిస్తుంది. మరిన్ని మంచి కథలతో మీ ముందుకు వస్తాను. ఈ ప్రయాణంలో అందరం కలిసి ముందుకు సాగుదాం" అని చెబుతూ ఆయన తన పోస్టును ముగించారు. ప్రస్తుతం రవీంద్ర పుల్లే వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528